క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: ప్రగతినగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సమ్మయ్య ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా విద్యుత్ సరఫరాను ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిల్ప లేఅవుట్,ఎలీఫ్ సర్కిల్, ఐసీఐసీఐ బ్యాంకు, కెనరా బ్యాంకు వెనుక వైపు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నాట్లు తెలిపారు.

అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా డి.నాగేశ్వరరావు



కుత్బుల్లాపూర్: అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా డి.నాగేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియంత్రణ విషయంలో పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతానన్నారు. ఒకవైపు జాతీయ రహదారి మరోవైపు రాజీవ్ రహదారి అనుసంధానంగా ఉన్న ప్రాంతంలో ట్రాఫిక్ చిక్కులు లేకుండా నిరంతరం నిఘా ఏర్పాటు చేస్తానన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూల్, కళాశాలలకు వివిధ పరిశ్రమలకు వెళ్లే వారు ట్రాఫిక్ ఆంక్షలు పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరి సహకారంతో ట్రాఫిక్ సమస్య లేకుండా చేస్తానని స్పష్టం చేశారు.

దేవాలయానికి రూ.లక్ష విరాళం



దుర్గాభవానీ ఆలయ కమిటీకి విరాళం అందజేస్తున్న మన్నెరాజు

సుభాష్‌నగర్: దేవాలయానికి విరాళం అందజేయడం చాలా సంతోషంగా ఉందని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మన్నెరాజు అన్నారు. బుధవారం ఆయన సూరారం ప్రధాన మార్కెట్‌లో ఉన్న జైదుర్గాభవానీ ఆలయానికి రూ.లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటస్వామి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ కోర్సు రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

లాలాపేట: ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ కోర్సు రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఓయూ స్టూడెంట్స్ ఎజెండా అమలుకు ప్రభుత్వ ముందుకు రావాలన్నారు. యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేస్తాం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ

దుండిగల్: మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేస్తామని కౌన్సిలర్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చర్చి గాగిల్లాపూర్ 214లో రూ.70 లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, శ్మశానవాటిక ప్రహరీ, సుందరీకరణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, శంకర్ నాయక్, జోసిఫిన్, నేతలు సుధాకర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, అమర్‌సింగ్, జయరాజ్‌రెడ్డి, రాజారెడ్డి, స్లీవారెడ్డి, థామస్ రెడ్డి, ఈశ్వర్ ముదిరాజ్, అర్జిరెడ్డి, రాహత్, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యాదిరెడ్డిబండ, రంగారెడ్డిబండలో
జీఓ.59 వర్తిస్తుంది

- విచారణ ప్రారంభించిన రెవెన్యూ అధికారులు
- దరఖాస్తుదారుల ఇంటి వద్దకు వెళ్లి వివరాల సేకరణ



యాదిరెడ్డి బండలో దరఖాస్తుదారుల నుంచి వివరాలు సేకరిస్తున్న కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు

సుభాష్‌నగర్: ఇళ్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వ స్థలాల్లో ఉంటున్న వారు జీఓ.59కు దరఖాస్తు చేసుకున్న విషయం విదితమే. కుత్బుల్లాపూర్ రెవెన్యూ పరిధిలో జీఓ.59 కింద 3300మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు 9 బృందాలుగా ఏర్పడి బుధవారం దరఖాస్తు చేసుకున్న వారి వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. జీడిమెట్ల డివిజన్ యాదిరెడ్డిబండలో జిల్లా అధికారి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి దరఖాస్తుదారుల వివరాలను సేకరించారు.

◆ జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌ను ఆనుకుని ఉన్న సర్వే నం. 25/1లోని యాదిరెడ్డి, రంగారెడ్డి బండలో 2020 జూన్ కంటే ముందు నుంచి ఉన్నట్లు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పత్రం ఉంటే వారికి తప్పకుండా వర్తిస్తుందని తహసీల్దార్ సంజీవరావు అన్నారు. సర్వే నం. 25/1లో కొంత స్థలం కోర్టు వివాదంలో ఉండటంతో 2022లో జీఓ.59 కింద దరఖాస్తులు తిరస్కరించామన్నారు.

◆ ఈ నేపథ్యంలో సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లడంలో కోర్టు వివాదంలో ఉన్న స్థలం తప్ప మిగతా వాటికి జీఓ.59 వర్తించేలా నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. స్థానికంగా ఉన్నవారు అయోమయానికి గురికాకుండా విచారణకు వచ్చిన అధికారులకు తమ దగ్గర ఉన్న పత్రాలు చూపించాలని రెవెన్యూ అధికారులు సూచించారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

కుత్బుల్లాపూర్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. బుధవారం భూపతిరెడ్డి 131వ డివిజన్‌లోని అంబేడ్కర్‌నగర్, పద్మానగర్ ఫేజ్-1, చెరుకుపల్లి కాలనీ, కల్పన సొసైటీలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి ఖమ్మం బహిరంగసభలో ఏఐసీసీ నాయకులు రాహుల్‌గాంధీ ప్రకటించిన రూ.4వేల పెన్షన్ గురించి ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రచారం నిర్వహించారు.

◆ భూపతిరెడ్డి ప్రజలతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో వృద్ధులు, వితంతువులు, బీడి కార్మికులు, వికలాంగులు, గీత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు, ఒంటరి మహిళలకు డయాలసిస్ పేషంట్లకు రూ.4వేల పెన్షన్ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి పేదలందరినీ ఆదుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు మిద్దెల యాదిరెడ్డి, ఇరుగు రాధాకృష్ణ, నవీన్, రహీమ్, భీమ్‌రావు, సురేష్, ఖాజాబాయ్, జలీల్ ఖాన్, ఖాన్‌సాబ్, అరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

'ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ గుర్తింపు ఇస్తుంది'

జీడిమెట్ల: రాజకీయంలోకి వచ్చి ప్రజలకు సేవ చేయాలంటే అది కాంగ్రెస్ పార్టీతో మాత్రమే సాధ్యమని.. కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్తకు, నాయకుడికి తగిన గుర్తింపు ఇస్తుందని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. బుధవారం 130డివిజన్‌కు చెందిన ఓబీసీ మోర్చా అధ్యక్షుడు భిక్షపతి, జనరల్ సెక్రటరీ సతీష్ బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు అబద్ధాల హామీలు ఇచ్చిన కేసీఆర్ ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చుని కేవలం తన కుటుంబీకులకు మాత్రమే దోచి పెడుతున్నారని హన్మంత్‌రెడ్డి విమర్శించారు. పేదలకు డబుల్ బెడ్రూమ్‌ల పేరిట, నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యార్థులను స్కాలర్‌షిప్‌ల పేరిట, మహిళలను డ్వాక్రా రుణాల పేరిట, రైతులకు రుణమాఫీ, ఉచిత ఎరువుల పేరిట మోసం చేసిన ఘనత కేవలం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇలా తెలంగాణ ప్రజలను నిట్టనిలువునా మోసం చేసి గద్దెనెక్కిన కేసీఆర్ వచ్చే ఎన్నికల్లో గద్దె దిగడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, వసంత్, జగన్ తదితరులు పాల్గొన్నారు.



రూ.4వేల పెన్షన్ పోస్టర్‌ను మహిళకు అందజేస్తున్న నర్సారెడ్డి భూపతిరెడ్డి



కొలన్‌హన్మంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న యువకులు

ఎమ్మెల్యేకు ఆహ్వానం



సుభాష్‌నగర్: గుండ్లపోచంపల్లిలో జరిగే బోనాల పండుగకు రావాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు బుధవారం దొంతిరి కార్తీక్‌రెడ్డి ఆహ్వానించారు. ఈనెల 9వ తేదీన దుండిగల్ మండలం గుండ్లపోచంపల్లిలో పెద్ద ఎత్తున బోనాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావాలని ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ యువకులు కోరారు. అనుదీప్‌రెడ్డి, శాంతన్ రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, రాహుల్‌రెడ్డి, నరియాదవ్, గుణేష్, అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తా

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: ప్రజా సంక్షేమం కోసమే పని చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలు, బస్తీలకు చెందిన ప్రజలు బుధవారం ఆయనను శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలపై సంక్షేమ సంఘాలు ఆయనకు వివరించారు. దీనిపై స్పందించిన శంభీపూర్ రాజు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



విద్యార్థిని ఆర్థిక సాయం



జీడిమెట్ల: చదువుకునే విద్యార్థులకు ఆర్థిక సాయం చేయడం.. వారి భవిష్యత్‌కు పునాది వేయడమేనని విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మి అన్నారు. ఇస్నాపూర్‌కు చెందిన అరుణ జ్యోతి మహేశ్వరంలోని మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతోంది. అరుణ జ్యోతి కుటుంబం ఆర్థికంగా వెనుకబడి ఉందని హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ మూడే రవినాయక్ ద్వారా తెలుసుకున్నారు. ఈ మేరకు బుధవారం ఏఈ లక్ష్మి ఎస్ఆర్‌నాయక్‌నగర్‌లోని హార్ట్ టు హెల్ప్ ఆఫీసులో అరుణ జ్యోతికి చదువు నిమిత్తం రూ.10వేల చెక్కును అందజేశారు.

ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి

జీడిమెట్ల: ఫాల్ సీలింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడిన ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నం బొబ్బిలికి చెందిన చల్ల సతీష్ బోరబండలో ఉంటూ ఫాల్‌సీలింగ్ పనులు చేస్తుంటాడు. బుధవారం జీడిమెట్లలోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌లో పనులకు వెళ్లాడు. సాయంత్రం 5గంటల సమయంలో రెండో అంతస్తులు నిచ్చెన వేసుకుని సతీష్ ఫాల్ సీలింగ్ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడిన సతీష్ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

మౌలిక సదుపాయాల కల్పనలో ముందుంటాం

కుత్బుల్లాపూర్: కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎల్లప్పుడు ముందుంటానని ఉంటానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా ఆయన బుధవారం 125డివిజన్‌లోని అంబేడ్కర్ నగర్, ఉమా దేవినగర్, లెనిన్‌నగర్‌లలో 82వ రోజు పాదయాత్ర నిర్వహించారు. కాలనీల్లో పర్యటిస్తూ పూర్తి చేసిన అభివృద్ధి పనులను పరిశీలించి మిగిలి ఉన్న పెండింగ్ పనుల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలో సీసీరోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా వివిధ అభివృద్ధి పనులను చేపట్టినందుకు కాలనీవాసులు ఆయనను శాలువాతో సత్కరించారు. పెండింగ్‌లో ఉన్న కల్వర్టు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని స్థానికులు ఆయనను కోరారు. త్వరలో పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఈ గోవర్ధన్, డీఈఈ రూపాదేవి, ఏఈ కళ్యాణ్, డీజీఎం విష్ణుప్రసాద్, మేనేజర్లు అంకిత్ ర్యూస్సీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



125వ డివిజన్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద

'తొమ్మిదేళ్లలో ఎమ్మెల్యే వివేకానంద చేసిందేమీ లేదు'

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట అభివృద్ధికి 9ఏళ్లుగా ఎమ్మెల్యే వివేకానంద చేసిందేమీ లేదని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. జగద్గిరిగుట్టలోని బీరప్పనగర్, సోమయ్యనగర్, జగద్గిరినగర్‌లలో బుధవారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగద్గిరిగుట్టలో సమస్యలు తాండవం చేస్తున్నాయని అన్నారు. ఎమ్మెల్యే ఈ డివిజన్ అభివృద్ధికి చేసిందేమీ లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు ఇప్పటికీ అద్దె భవనాలలో నడపడం విడ్డూరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు తమ ప్రాంతాల్లోని సమస్యలను ఆయనకు వివరించారు. వీలైనంత త్వరగా ఈ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జేకే శేఖర్‌యాదవ్, డివిజన్ అధ్యక్షులు పున్నారెడ్డి, డివిజన్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి మేకల సురేష్ రెడ్డి, సిద్దిరాంరెడ్డి, మహేందర్, నరేష్‌గౌడ్, అభిలాష్, అరుణ, వసుంధర, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో భాగంగా ట్రాక్టర్ నడుపుతున్న కూన శ్రీశైలంగౌడ్



ప్రజల సమస్యలు వింటూ..

వైద్య కళాశాల ఏర్పాటుపై హర్షం

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ప్రత్యేక జీఓ.87 ద్వారా ప్రభుత్వ వైద్య కళాశాల స్థాపనకు సీఎం కేసీఆర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలోని 33 జిల్లాల్లో జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తామని గతంలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం జీవో జారీ చేశారు. దీంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 100 ఎంబీబీఎస్ సీట్ల కెపాసిటీతో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు కానుంది. ఈ భవన నిర్మాణ పనులను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖకు అప్పగించారు.



ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు

పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తవించిన ఎమ్మెల్యే వివేకానంద్...

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ నియోజకవర్గంలో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని పలుమార్లు అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. తనకు అవకాశం దొరికిన ప్రతిసారి ఎమ్మెల్యే వైద్య కళాశాల విషయంపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ప్రస్తుతం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని వైద్య కళాశాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం పట్ల ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్రజలకు ఎంతో మేలు జరుగుందని పేర్కొన్నారు. ఇప్పటికే జగద్గిరిగుట్టలో హెచ్ఎండీఏ 20 ఎకరాల స్థలాన్ని పరిశీలించి అందుబాటులో ఉంచారు.

కార్మికుల పక్షాన దీక్ష చేయడానికి ఎమ్మెల్యే సిద్ధమా.?



సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీశైలంగౌడ్

- మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ సవాల్
- సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ కార్మికుల దీక్షకు మద్దతు

జీడిమెట్ల: సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ కార్మికుల పక్షాన దీక్ష చేయడానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ సిద్ధమా అంటూ బీజేపీ నాయకులు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ సవాల్ విసిరారు. బుధవారం శ్రీశైలంగౌడ్ సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ కార్మికుల దీక్షకు మద్దతు తెలిపి అనంతరం ఆయన కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... 127 రోజులుగా కార్మికులు న్యాయం కోసం నిరాహార దీక్ష చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోరా అని ప్రశ్నించారు. పరిశ్రమ మూసివేయడంతో దాదాపు 600కుటుంబాలు రోడ్డున పడ్డా ఎమ్మెల్యే కానీ కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి గానీ స్పందించకపోవడం బాధాకరమన్నారు. అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మంత్రి మల్లారెడ్డిలు దమ్ముంటే కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వ అండదండలు చూసుకుని పరిశ్రమల యాజమాన్యాలు కార్మికులకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికే జీడిమెట్లలో చాలా వరకు పరిశ్రమలు మూతపడ్డాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌రావు, లక్ష్మారెడ్డి, ఈశ్వర్‌రావు, దయాకర్‌చారి, సూర్యనారాయణ, దుర్యోధన్‌రావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఈటలకు శుభాకాంక్షలు

తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్‌గా ఈటల రాజేందర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్, నాయకులు బుధవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు పార్టీ కార్యవర్గ సభ్యులు పర్వ వెంకటరమణ ఉన్నారు. – జీడిమెట్ల



ప్రజారోగ్యంపై ఏదీ శ్రద్ధ..?

అస్తవ్యస్త పరిసరాల్లో తినుబండారాల తయారీ

- మాంసం క్రయవిక్రయాల్లోనూ అపరిశుభ్రత
- నాణ్యతమైన పదార్థాలు అందించడంలో విఫలం
- కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యం
- తనిఖీలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజారోగ్యంపై అశ్రద్ధ ప్రాణాల మీదకు తెస్తోంది.. మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు పరిశుభ్రత తమ పరిధిలో లేదన్నట్లు, అది తమకు సంబంధం లేనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. వినియోగదారుల హక్కుల చట్టం ప్రకారం తినుబండారాల తయారీలో శుభ్రత, నాణ్యత విధిగా పాటించాల్సి ఉండగా.. గ్రేటర్ శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో అమలుకు నోచుకోవడం లేదు. పురపాలక సంఘాల్లోని పలు కూడళ్లు, చౌరస్తాలు, పార్కులు, రద్దీ ప్రదేశాలు, బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్ల సమీప ప్రాంతాలతో పాటు హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి, రాజీవ్ రహదారితోపాటు హైదరాబాద్-నిజామాబాద్ రహదారి ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లు, టీ కొట్లలో పరిశుభ్రత చర్యలు కనిపించడం లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తాయనడంలో సందేహం లేదు. రహదారులపై ఉండే హోటళ్లు నిత్యం రద్దీగా ఉంటున్నాయి. వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి ఆహార పదార్థాలపై పడుతోంది. అయినా నిర్వాహకులు వాటిని విక్రయిస్తున్నారు. చేతులకు రక్షణ కవచాలు(తొడుగులు)వేసుకోకుండానే ఆహార పదార్థాలు, తినుబండారాలు తయారు చేస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో నూడుల్స్, ఫ్రైడ్ రైస్ తయారీ తర్వాత ప్లాస్టిక్ పాత్రలు, కవర్లలో వడ్డిస్తున్నారు.

◆ కల్తీ నూనె, ప్రమాదరకమైన రంగులు..

ఆహార పదార్థాల తయారీలో భాగంగా వంటకాల్లో వాడిన నూనెనే తిరిగి వాడుతుండటంతో ప్రజారోగ్యం గాలిలో దీపంలా మారుతోంది. కొంతమంది కల్తీ నూనెల్లోనే ఆహార పదార్థాలను వండుతున్నారు. ఎలాంటి రక్షణ లేక ఈగలు, దోమలు వాలుతున్నాయి. వినియోగదారులను ఆకట్టుకునేందుకు ఆహార పదార్థాల్లో ప్రమాదకరమైన రంగులను వాడుతున్నారు. హోటళ్లలో సమోసాలు, బజ్జీలు, గారెలకు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో చికెన్, వెజ్ మంచూరియాల తయారీలో ఎరుపు రంగులు వాడుతున్నారు. మిగిలిపోయిన వాటిని ఫ్రిడ్జ్‌ల్లో ఉంచి మరుసటి రోజు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల నుంచి వెలువడే పొగతో కూడా ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు, తోటి వ్యాపారులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. కూతవేటు దూరంలో పురపాలక సంఘాల కార్యాలయాలు ఉన్నా.. తనిఖీలు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

◆ హెల్త్ ఆఫీసర్ల పట్టింపేదీ..?

గ్రేటర్ శివారు జిల్లాల్లోని 29 పురపాలక సంఘాలతో పాటు 614 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇందులో మెజారిటీ పురపాలక సంఘాలు, జీపీల్లోని మాంసం క్రయవిక్రయ కేంద్రాల్లో పరిశుభ్రత పాటించడం లేదు. పురపాలక సంఘాల్లోని మాంసం దుకాణాలపై హెల్త్ ఆఫీసర్ల పర్యవేక్షణ ఏమాత్రం లేకపోవడంతో ఫ్రిడ్జిల్లో రెండు, మూడు రోజుల పాటు ఉంచిన మాంసాన్ని కూడా విక్రయిస్తున్నారు. దీంతో పట్టణవాసులు రోగాల బారిన పడుతున్నారు.

◆ పర్యవేక్షణ కరవై..

గ్రేటర్ శివారుల్లో పెరుగుతున్న హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టీ కొట్లకు అనుగుణంగా ఆహార భద్రతాధికారులు లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడుతోందని తెలుస్తోంది. మేడ్చల్ జిల్లాలో నాలుగేళ్లుగా ఆహార భద్రతాధికారి పోస్టు ఖాళీగా ఉంది. పురపాలక సంఘాల్లో కూడా హెల్త్ ఆఫీసర్లు లేకపోవడంతో హోటళ్లు, తినుబండారాల కేంద్రాలు, మాంసం క్రయవిక్రయ కేంద్రాల్లోని పదార్థాలపై పర్యవేక్షణ కరువైంది. హోటళ్లు, మాంసం క్రయవిక్రయ కేంద్రాలను నడిపే వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

నిబంధనలు పాటించని వారిపై..

వర్షాకాలం ఆరంభంతో తినుబండారాల తయారీ కేంద్రాలు పరిశుభ్ర వాతావరణంలో ఉండేలా పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులకు సూచించినట్లు జిల్లా అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీస్) అభిషేక్ ఆగస్త్య పేర్కొన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, మాంసం క్రయవిక్రయ కేంద్రాల నిర్వాహకులు పరిశుభ్రత పాటించేలా నోటీసులు అందిస్తామన్నారు. పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టి జరిమానాలు విధించే బాధ్యత ఆహారభద్రత శాఖాధికారులు చేపట్టాల్సి ఉందన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029